


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -182-

**(19 మే 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"మళ్ళీ జన్మంటూ వుంటే,** అందులో నరజన్మ అంటూ ఏర్పడితే మీకెలాటి జన్మకావాలని వుంది? ఏ రూపంలో జన్మించాలని వుంది. పురుషజన్మ కోరుతారా? స్త్రీ జన్మకోరతారా?" అని ఒక పత్రికా విలేఖరి ఒక పెద్ద మనిసిని ప్రశ్నించాడుట.

ఆ పెద్ద మనిషి కొంచెం సేపు ఆలోచించి "అంత పెద్ద ప్రశ్నవేస్తే జవాబు చెప్పడం కష్టం. అయినా మీరడుగుతున్నారు గనుక, తోచిన ముక్కలేవో కొద్దిగా చెపుతాను. మీరు సంతృప్తి పడాలి" అన్నాడుట.

"సంతృప్తి చెందడానికేంలెండి. మీరెంతవరకు చెపితే అంతవరకే ముఖ్యం. అవసరమైతే మధ్య మధ్య కొన్ని ఉప ప్రశ్నలు వేస్తాం. వాటితో మరికొంత భోగట్టా లభ్యమవుతుంది. తోచింది చెప్పండి" అన్నాడుట విలేఖరి.

"నిజం చెప్పాలంటే, నాకసలు నరజన్మ మీద అంత ఇష్టంలేదు. యాభైయేళ్ళు చూశానుగా. ఆశలు సిద్ధించడం కన్నా, దూసుకుపోవడమే ఎక్కువగా జరిగింది. కృతజ్ఞులకంటె కృతఘ్నులే ఎక్కువమంది ఎదురయ్యారు జీవితంలో. సంపాదన కన్నా ఖర్చే ఎప్పుడూ ఎక్కువగా కనిపిస్తోంది. దగాకోరులే భోగలాలసులుగా జీవిస్తున్నారు. అర్హతలేనివాళ్ళే చాలామంది పదవులు నిర్వహిస్తున్నారు. ఇలా చెప్పాలంటే, పెద్ద జాబితా అవుతుంది" అన్నాడు ఆ పెద్దమనిషి.

"మానవ జన్మమీద మీకు యిష్టంలేకపోవచ్చు. కాని అది మీ చేతుల్లో లేదుగా. ఏవో కొన్ని చెడుపనులు చేస్తే అవి అయి పుడతారనీ, ఇవి అయి పుడతారనీ శాస్త్రంలో వుందనుకోండి. మీరలాటి చెడు పనులు చేస్తే మాత్రం అలా పుడతారని గ్యారంటీ ఏం వుంది? పైగా మనం ప్రస్తుతం ఆలోచిస్తున్న విషయం కేవలం ఊహకు చెందింది మాత్రమే. కనుక "ఒకవేళ పుడితే" అన్న అంశం మీదనే మాట్లాడండి. మాక్కావలసింది మీ దృక్పథాలూ, ఆశయాలూ మాత్రమేగా!" అన్నాడు పత్రికా విలేఖరి.

అప్పుడా పెద్దమనిషి ఇలా చెప్పాడు. "నా పేరు లేకుండా మీరు నా అభిప్రాయాలు ప్రకటిస్తామన్నారు కనుక నేను మనస్సులో ఉన్నది ఉన్నట్లు చెబుతాను. నాకు మాత్రం మళ్ళీ జన్మలో మానవత్వమే సిద్ధిస్తే మగవాడిగానే జన్మించాలని వుంది" అన్నాడాయన.

పత్రికా విలేఖరి ఎంతో కుతూహలం ప్రకటిస్తూ "చాలా బాగుంది. అయితే కారణాలు వివరిస్తారా? కొంచెం వివరంగానే చెప్పండి. మరేం ఫర్వాలేదు" అన్నాడు.

"కారణాలు చాలా వున్నాయి. నా ఊహ ప్రకారం మగవాళ్ళ ఆధిపత్యం, గౌరవం మొదలైనవాటికి చెందిన యుగం దాటిపోతోందేమోననిపిస్తోంది. మగవాళ్ళకు ఏనాడో వచ్చింది స్వేచ్ఛ. దాని విలువ తగ్గిపోయింది. మగువలకు క్రొత్తగా వచ్చింది – ఇంకా వస్తోంది. అందులో ఎంతో గౌరవం, ఠీవీ వున్నాయి. వాటిని అనుభవించడంలో కొంత హుందాతనం వుండద్దూ! పూర్వం స్త్రీ బానిస. భర్త అడుగుజాడల్లో నడిచేది. ప్రతిరోజూ అతగాడు పెట్టే బాధలను సహిస్తూ, చీరచెంగు కన్నీటితో పిడిచేది. అలాగే భారంగా జీవితం గడిచేది. ఇప్పుడు చాలామంది మగవాళ్ళు భార్యలకు పర్సనల్ అసిస్టెంట్లుగా మారిపోయారు.

"కొందరు పిచ్చి సౌందర్యోపాసకులు... కొందరు వెర్రి ప్రేమికులు, కొందరు వట్టి వైతాళికులు అలా మారిపోయారు.

"మరి స్త్రీకి ఎంత ఠీవి, దర్పం వచ్చాయంటారు? హాయిగా భర్త హృదయ సింహాసనం మీద అధిష్ఠిస్తోంది. ముందు సావిట్లో సోఫామీద అధిష్టిస్తోంది. ఎలాంటి అదృష్టం. అన్నాడాయన ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

"స్త్రీని గౌరవించడం జాతికి విద్యుక్త ధర్మం" అని లోకం హెచ్చరిస్తోంది. మగువలు కూడా యుగ ధర్మాన్ని పాటించి ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం చెప్పడం స్త్రీ పురుషులకు సమానఫాయిలు కల్పించాలంటున్నారనుకోండి. కాని కొంత కాలంపోయిన తరవాత పురుషులు వెనకపడటం, మహిళలు ముందుకు రావడం జరుగుతుంది. అది యుగపరిమాణం. కనుకనే మరో జన్మ ఎత్తాలంటే మహిళగానే జన్మించడం మంచిదని నా అభిప్రాయం" అన్నాడా పెద్ద మనిషి.

"బాగా సమన్వయించి చెప్పారు. అయితే మహిళగా జనించాలనే కోర్కెను తేట తెల్లం చేశారు. బాగానే వుంది. మహిళలలో అనేక తీరులుంటాయి. విద్యావతులు, సౌందర్యవతులు, గుణవతులు, చలాకీ మహిళలు, చమత్కారవతులు, రాణులు, జాణలు వగైరాలుంటారు గదా! మీరే జన్మ ఆశిస్తున్నారు?" అని పత్రికా విలేఖరి ప్రశ్నించాడు.

"మీరు మంచి ప్రశ్నే వేశారు. పైగా బోలెడు జాబితా కూడా ఇచ్చారు. అందరికంటె చమత్కారవతులు, చలాకీ మహిళలకే ఎక్కువ స్వాతంత్ర్యం, పలుకుబడీ వుంటుందని నా అభిప్రాయం.

మీరు చెప్పిన జాబితాలోనుంచి ఎవరిని తీసుకున్నా ఈ రెండు గుణాలూ లేందే భాషించడం కష్టం. చమత్కారం అయస్కాంతంలాటిది. చలాకీ కీలుగుర్రంలాటిది. ఎటువంటి వాళ్ళనయినా తెలిమబ్బుల్లోకి తేలగొట్టవచ్చు. ఆకర్షించి అదుపులో పెట్టుకోవచ్చు. ఏమంటారు?" అన్నాడు ఆ పెద్దమనిషి ఉవ్విళ్ళూరుతూ.

"మీకు శాస్త్రం కూడా బాగా తెలుసునల్లేవుంది. నిజానికి మీరు ఈ విషయాల మీద, మంచి వ్యాసాలూ, గ్రంథాలూ వ్రాయవచ్చు. అయితే మన దేశంలో అనేక ప్రాంతాలు, జాతులూ వున్నాయికదా. ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్క ప్రత్యేకత వుంది కదా. మరి మీరు ఏ ప్రాంతంలో జన్మించదలిచారు? లేదా ఏ జాతిలో జన్మించాలని ఉబలాటపడుతున్నారు?" అని పత్రికా విలేఖరి ప్రశ్నించాడు.

ఆ పెద్దమనిషి నవ్వాడు.

"స్వాతంత్ర్యమంటూ వుంటే ప్రాంతం ఏదైతేనేమండీ. స్త్రీ ఎక్కడ జన్మించినా స్త్రీ యేకదా! పురుషుడు అంతేకదా! నాట్యం నేర్చినవాడు నరకానికి వెళ్ళినా ఊరుకోడని శాస్త్రం వుంది. అలాగే ఎక్కడ జీవించినా, నే చెప్పిన చలాకీ చమత్కారం వుంటే చాలు" అన్నాడాయనగారు.

పత్రికా విలేఖరి ఎంతో సంతోషంతో వ్రాసుకున్నాడు అదంతా. "చాలా బాగా చెప్పారు మీ అభిప్రాయాన్ని ఒకవేళ ఆడజన్మ ఎత్తడానికి వీలులేక మగ జన్మే ఎత్తవలసి వస్తుందనుకోండి. మాటవరకు, అప్పుడెలాటి మగజన్మ కోరతారో ఆలోచించండి. మరోసారి వచ్చితెలుసుకుంటాను. ఈ వ్యాసాన్ని వచ్చే జన్మలో 'మగ జన్మ వద్దు' అనే శీర్షికతో ప్రచురిస్తాం" అన్నాడు పత్రికా విలేఖరి.

"పేరు మాత్రం వెయ్యకండి" అన్నాడు ఆ పెద్దమనిషి.

"వెయ్యంలెండి. ఒక 'మగజీవి' అని మాత్రమే వేస్తాం. వస్తాం" అని ఆ విలేఖరి వెళ్ళిపోయాడు.

Post your comments